క్లుప్తంగా

పారిశుధ్య కార్మికులకు దుస్తుల పంపిణీ



పారిశుధ్య కార్మికులకు దుస్తులు పంపిణీ చేస్తున్న చైర్‌పర్సన్ సత్యనాగేంద్రమణి

అమలాపురం టౌన్: స్థానిక మున్సిపల్ కార్యాలయంలో పారిశుధ్య కార్మికులకు మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి సత్యనాగేంద్రమణి, కౌన్సిలర్లు ఆదివారం దుస్తులు పంపిణీ చేశారు. మహిళా కార్మికులకు చీరలు అందజేశారు. అనంతరం చైర్‌పర్సన్ సత్య నాగేంద్రమణి అందరికీ సంక్రాంతి శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్ కట్టోజు సన్న్యయ్యదాసు, కౌన్సిల్ కో–ఆప్షన్ సభ్యుడు పెనుమాడి జాన్స్ బిల్లీ, మున్సిపల్ మేనేజర్ ఎంవీఎస్ నారాయణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న పూలదండల అలంకరణ



శ్రీదేవి అమ్మవారి ఆలయం వద్ద పూల దండల అలంకరణ

అమలాపురం టౌన్: స్థానిక శ్రీదేవి మార్కెట్‌లో వేంచేసి ఉన్న శ్రీదేవి అమ్మవారి ఆలయాన్ని సంక్రాంతి సందర్భంగా ఆదివారం ఉదయం పూలదండలతో వినూత్నంగా అలంకరించారు. శ్రీదేవి ఉత్సవ కమిటీ చైర్మన్ గంగాబత్తుల రాంబాబు ఆధ్వర్యంలో కమిటీ ప్రతినిధులు, అర్చకులు ఓ వైపు పూల దండలతో అమ్మవారి రూపాన్ని, మరోవైపు సంక్రాంతి శుభాకాంక్షలను తీర్చిదిద్దారు. పూల అలంకరణ భక్తులను విశేషంగా ఆకట్టుకుంది.

అగ్నికుల క్షత్రియ సంక్షేమ సంఘ అధ్యక్షుడిగా బాబ్జీ



కొల్లు సత్యనారాయణ మూర్తి(బాబ్జీ)

అల్లవరం: అమలాపురం తాలుకా అగ్నికుల క్షత్రియ సంక్షేమ సంఘ అధ్యక్షుడిగా ఓడలరేవు గ్రామానికి చెందిన కొల్లు సత్యనారాయణమూర్తి(బాబ్జీ) ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం అమలాపురంలోని తాలుకా అగ్నికుల క్షత్రియ భవనంలో జరిగిన కార్యక్రమంలో 24 గ్రామాల అగ్నికుల క్షత్రియ పెద్దలు బాబ్జీని ఎన్నుకున్నారని పాల వెంకటేశ్వరరావు తెలిపారు. కార్యక్రమంలో హైకోర్టు అడ్వకేట్ కేవీ వర్మ, చింతా శ్రీను, లంకే భీమరాజు, పెమ్మాడి సాయి, కోలా తాతరాజు, మల్లాడి వెంకటరమణ, కొప్పాడి దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

పిల్లలకు దుప్పట్ల అందజేత



కామాక్షి పీఠంలో పిల్లలకు దుప్పట్లు అందజేస్తున్న లయన్స్ క్లబ్ ప్రతినిధులు

అమలాపురం టౌన్: స్థానిక శ్రీకామాక్షి పీఠంలోని ప్రేమ మందిరంలో పెరిగే అనాథ పిల్లలకు లయన్స్ జోన్ చైర్మన్ జంపన సుమన్ వర్మ, క్లబ్ అధ్యక్షుడు గోకవరపు మల్లికార్జునరావుల చేతుల మీదుగా ఆదివారం దుప్పట్లు, పండ్లు పంచిపెట్టారు. క్లబ్ ప్రతినిధి లక్కింశెట్టి సత్యనారాయణమూర్తి కుటుంబంలో సూర్య వందన పుట్టినరోజు సందర్భంగా పీఠంలోని 50 మంది బాలబాలికలకు దుప్పట్లు, పండ్లు అందించారు. కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి చిక్కాల సతీష్, రాచకొండ దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన విష్ణు సహస్ర నామ పారాయణ



విష్ణు సహస్ర నామ పారాయణ చేస్తున్న భక్తులు

అమలాపురం టౌన్: ధనుర్మాసం సందర్భంగా గత 40 రోజులుగా అమలాపురం పట్టణంలో రోజుకో ఇంట్లో జరుగుతున్న విష్ణు సహస్ర నామ పారాయణ కార్యక్రమాలు ఆదివారంతో ముగిశాయి. చివరి రోజు స్థానిక శ్రీరామనగర్‌లోని గుళ్లపల్లి సత్యనారాయణ ఇంట్లో పారాయణ సాగింది. విశ్వ హిందూ పరిషత్ ప్రాంత సత్సంగ ప్రముఖ్ రాళ్లపల్లి పాపయ్యశర్మ, పరిషత్ జిల్లా ఉపాధ్యక్షురాలు భమిడిపాటి శ్రీలక్ష్మి పర్యవేక్షణలో పారాయణ జరిగింది. ఈ క్రతువులో గుళ్లపల్లి వెంకట్రామ్, శిష్టా శ్రీహరి, డాక్టర్ ఆకెళ్ల విశ్వనాథ శర్మ, పేరి లక్ష్మీనరసింహం, వై.భానుమతి తదితరులు పాల్గొన్నారు.



కూనవరంలో ఏర్పాటు చేసిన భోగిమంట



అమలాపురం మండలం రంగాపురంలో భోగి మంట



మురమళ్లలో భోగి మంట వద్ద స్థానికుల సందడి



అమలాపురం సంక్రాంతి సంబరాల్లో భోగి మంట

పల్లె పల్లెలో సంక్రాంతి సంబరాలు

- ఆనందోత్సాహాల నడుమ భోగి పండగ
- గ్రామాల్లో అలరిస్తున్న సంప్రదాయ ప్రదర్శనలు

అమలాపురం టౌన్/ముమ్మిడివరం/ఉప్పలగుప్తం/యానాం/అమలాపురం రూరల్/ఐ.పోలవరం/కాట్రేనికోన: సంక్రాంతి వచ్చింది. సందళ్లు తెచ్చింది. ఇంటింటా రంగురంగుల రంగవల్లులు, హరిదాసుల కీర్తనలు, డూడూ బసవన్న అంటూ గంగిరెద్దుల విన్యాసాలు, సోదెమ్మలు, కొమ్మదాసరులు, కోలాటాలు, జోడెడ్ల బండ్ల సవారీలు, పట్టా కత్తులతో సరదా విన్యాసాలు.. ఒక్కటేమిటి తెలుగు సంస్కృతి, సంప్రదాయాలను నేటి తరానికి తెలియజేస్తుంది. అంతేనా ఇంటింటా సున్నుండలు, రవ్వుండలు, అరిసెలు, జంతికలు, బూరెలు, గారెలు తదితర పిండి వంటల ఘుమఘుమలు నోరూరిస్తున్నాయి. పండగకి సొంత గూటికి చేరుకుంటున్న పిల్లలను చూసి వేయి కళ్లతో ఎదురుచూస్తున్న పెద్దల సంతోషానికి అవధుల్లేకుండా పోతుంది. ఇంటింటా పండగ సందడితో సంక్రాంతి సంబరాలు అంబరాలను తాకుతున్నాయి. పిల్లలు, పెద్దలు సంప్రదాయ దుస్తులు ధరించి సంక్రాంతి పండగకు కొత్త శోభను తెచ్చారు. తొలి రోజు ఆదివారం భోగి పండగను పురస్కరించుకుని గ్రామాల్లో తెల్లవారుజామునే భోగి మంటలు వెలిగించారు. పిల్లలు భోగి మంటల్లో గోపిడకల దండలు వేసి ఆనందించారు. ఆదివారం సాయంత్రం చిన్న పిల్లలకు భోగి పండ్లు వేసి దీవించారు.

● అమలాపురం హౌసింగ్ బోర్డు కాలనీలో కోనసీమకు చెందిన హైదరాబాద్, విశాఖపట్నం మెట్రో కెమ్ కంపెనీల అధినేత డాక్టర్ నందెపు బాలాజీ కుటుంబం ఆధ్వర్యంలో కోనసీమ సంక్రాంతి సంబరాలు ఆదివారం ఉదయం సంప్రదాయబద్ధంగా ప్రారంభమయ్యాయి.

● ఉప్పలగుప్తం మండలంలోని కూనవరంలో చిన్నారులు గత వారం రోజులుగా ఇంటింటా సేకరించిన కలప, పిడకలతో భోగి మంట వేశారు. అది చూసిన పెద్దలు వారిని మెచ్చుకున్నారు.



ముమ్మిడివరంలో వేసిన భోగి మంట



యానాం ధోబీవారి వీధిలో వెలిగించిన భోగి మంట



ముగ్గుల పోటీలను ప్రారంభించిన ఏఎంసీ చైర్మన్ కుడిపూడి శివన్నారాయణ

● యానాం నియోజకవర్గంలోని చింతావారి వీధి, దోబీ స్ట్రీట్, చిన్నా సెంటర్, వెంకట్ నగర్, వికాస్ కోలనీ, గోపాల్ నగర్, కనకాలపేట, దరియాలతిప్ప, సావిత్రినగర్, దొమ్మేటిపేట, గిరియాంపేట తదితర ప్రాంతాల్లో భోగి పండగను ఉత్సాహంగా జరుపుకున్నారు.

● అమలాపురం మండలంలో భోగి పండగ సందర్భంగా బండారులంక, కామనగరువు, భట్నవిల్లి, పేరూరు సమనస, చిందాడ గరువుల్లోని వీధుల్లో యువకులు పోటాపోటీలగా భోగిమంటలు వేశారు. ఆదివారం తెల్లవారుజామున 2 గంటల నుంచే చిన్నారులు భోగి మంటల కోసం కలప, దుంగలు, చెక్కలు సేకరిస్తూ సందడి చేశారు. బండారులంక చినచంద్రాపురంలో కాలెపు భీమేశ్వర సిద్ధాంతి ఆధ్వర్యంలో భోగిమంటలు వేశారు.

● భోగి పండగ సందర్భంగా ప్రముఖ పుణ్యక్షేత్రం మురమళ్ల వీరేశ్వరస్వామి ఆలయం భక్తులతో కిటకిటలాడింది. మురమళ్లలో లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో గోదాదేవి కల్యాణం కన్నుల పండువగా జరిగింది.

ఉత్సాహంగా రంగవల్లుల పోటీలు

తాళ్లరేవు: సంక్రాంతి సంబరాలను పురస్కరించుకుని మండల పరిధిలోని పి.మల్లవరంలో ఆదివారం రంగవల్లుల పోటీలు ఉత్సాహంగా నిర్వహించారు. 13వ సంక్రాంతి సంబరాల్లో భాగంగా ఏర్పాటుచేసిన ఈ పోటీలను ముమ్మిడివరం ఏఎంసీ చైర్మన్ కుడిపూడి శివన్నారాయణ ప్రారంభించారు. ఈ సందర్భంగా సుమారు 50 మంది మహిళలు సంక్రాంతి ప్రాముఖ్యతను వివరిస్తూ వేసిన ముగ్గులు అందరినీ ఆకట్టుకున్నాయి. పోటీల్లో ప్రథమ బహుమతిని రజనీ గెలుచుకున్నారు. కార్యకమంలో మట్టపర్తి లోవరాజు, ఎడ్ల కుటుంబరావు, వెంటపల్లి వెంకటేశ్వరరావు, శీలం గోవిందు, దున్నా రాంబాబు, రాజు పాల్గొన్నారు.

నేడు మకర జ్యోతి దర్శనం

అమలాపురం రూరల్: మండలంలోని ఈదరపల్లిలో కోనసీమ మహాశాస్త అయ్యప్ప స్వామి ఆలయంలో సోమవారం మకరజ్యోతి దర్శనం జరుగుతుందని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఆదివారం జరిగిన ఆలయ కమిటీ సమావేశంలో మకరజ్యోతి దర్శనం ఏర్పాట్లపై చర్చించారు. సోమవారం ఉదయం స్వామివారికి లక్ష్మీగణపతి హోమం, పంచామృత అభిషేకం, గ్రామోత్సవం, కోనా వెంకటరాజు గురుస్వామి ఆధ్వర్యంలో పడిపూజ, సాయంత్రం 6.15 గంటలకు మకరజ్యోతి దర్శనం నిర్వహిస్తామని చెప్పారు. సమావేశంలో కమిటీ సభ్యులు వాసన పుల్లయ్య నాయుడు, మోరం దొరబాబు, నల్లా చిట్టిబాబు, బండారు గంగాధరం, రామాయణం వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ ఘన విజయం తథ్యం



శాంతకుమారి దంపతులను సత్కరించిన గ్రామస్తులు

తాళ్లరేవు: అధికార దాహంతో ఎన్ని పార్టీలు కలిసి పోటీకి వచ్చినా వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ ఘన విజయం తథ్యమని జిల్లా వైఎస్సార్ సీపీ మహిళా విభాగ కార్యదర్శి పెట్ల శాంతకుమారి అన్నారు. ఆదివారం మండలంలోని ఎంఎల్‌కే నగర్‌లో గ్రామస్తులు, వైఎస్సార్ సీపీ కార్యకర్తల ఆధ్వర్యంలో శాంతకుమారి, సూర్యనారాయణరాజు దంపతులను దుశ్శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో గృహసారథులు శీలి రాజు, పువ్వల కృష్ణమూర్తి, మందపల్లి నాగేష్, పలివెల ప్రభాకరరావు, పువ్వల వెంకటలక్ష్మి, శీలి రాణి తదితరులు పాల్గొన్నారు.

బరిలో పందెం కోళ్లు



గెద్దనపల్లిలో కోడి పందేలు చూసేందుకు హాజరైన ప్రజలు

గ్రామాల్లో జోరుగా కోడి పందేలు

ముమ్మిడివరం/ఉప్పలగుప్తం/అల్లవరం/అమలాపురం రూరల్/కాట్రేనికోన: సంక్రాంతి సందర్భంగా అనేక గ్రామాల్లో నిర్వాహకులు పందెం కోళ్లను బరిలోకి దింపారు. తొలి రోజైన భోగి పండగ రోజున పెద్ద ఎత్తున నగదు లావాదేవీలు జరిగాయి. ఎక్కడచూసినా బరులు జనాలతో కిటకిటలాడుతున్నాయి. ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన యువత జూదాలకు ఆకర్షితులై పెద్ద ఎత్తున పందేలు కాస్తున్నారు. ఆదివారం రాత్రయినా సరే ఆపకుండా విద్యుత్ కాంతుల నడుమ కోడి పందేలు, గుండాటలను నిర్వహించారు. పలుచోట్ల భారీకేడ్లు, ఎల్ఈడీ స్క్రీన్లు సైతం ఏర్పాటుచేశారు. ఇక సంక్రాంతి రోజున పందేలు మరింత జోరందుకుంటాయని నిర్వాహకులు భావిస్తున్నారు.

ఇదీ పరిస్థితి

● ఉప్పలగుప్తం మండలంలోని చల్లపల్లి, ఎస్.యానం, ఎస్.కొత్తపల్లి, గొల్లవిల్లి, భీమనపల్లి, ఉప్పలగుప్తం, చినగాడవిల్లి గ్రామాల్లో సంక్రాంతి నేపథ్యంలో కోడి పందేలు, గుండాటలు జోరుగా సాగుతున్నాయి.

● అల్లవరం మండలంలోని అల్లవరం, రెల్లుగడ్డ, గోడి, కోడూరుపాడు, గుత్తులవారిపాలెం గ్రామాల్లో ఆదివారం కోడి పందేలు నిర్వహించారు. బరుల్లో గుండాట సైతం జోరుగా సాగుతోంది.

● ముమ్మిడివరం మండలం రాజుపాలెం, సీహెచ్ గున్నేపల్లి, అన్నంపల్లి, అయినాపురం, ఐ.పోలవరం మండలం ఎదుర్లంక, కేశనకుర్రు, ఐ.పోలవరం, కొమరగిరి, మురమళ్ల, గుత్తెనదీవి, కాట్రేనికోన మండలం చెయ్యేరు, గెద్దనాపల్లి, పల్లంకుర్రు, తాళ్ళరేవు మండలం తాళ్ళరేవు తదితర గ్రామాల్లో కోడి పందేలు జోరుగా సాగుతున్నాయి.

యానాం: యానాంలో కోడిపందేలు, గుండాటలకు పోలీసులు అనుమతించకపోవడంతో సరిహద్దున ఉన్న తాళ్లరేవు మండల పరిధిలోని కాపులపాలెం, సుంకరపాలెంతో పాటు ఐ.పోలవరం, కాట్రేనికోన, ముమ్మిడివరం తదితర ప్రాంతాలకు వెళుతున్నారు. సంక్రాంతిని పురస్కరించుకుని హైదరాబాద్, చెన్నై తదితర ప్రాంతాల నుంచి కోడిపందేలు చూసేందుకు అధిక సంఖ్యలో యువత యానాంకు తరలిరావడంతో పలు లాడ్జిలు, హోటళ్లు, రెస్టారెంట్లు కిటకిటలాడుతున్నాయి. యానాం బైపాస్ సెంటర్ అయితే మందుబాబులతో తిరునాళ్లను తలపిస్తుంది.

అమలాపురం మండలంలోని ఇందుపల్లి, గున్నేపల్లి అగ్రహారం, సవరప్పాలెం, రోళ్లపాలెం గ్రామాల్లో కోడిపందేలు జోరుగా సాగాయి. కామనగరువు ఇందుపల్లిలో మాత్రమే భారీ ఎత్తున సాగాయి. కామనగరువు బైపాస్‌రోడ్డులో జరిగిన కోడి పందేలు, గుండాటలను చూసేందుకు పెద్ద ఎత్తున జనం తరలివచ్చారు. కాట్రేనికోన మండలంలోని గద్ధనపల్లి, చెయ్యేరుల్లో కోడి పందేలు జోరుగా సాగాయి.



ముమ్మిడివరం శివారు రాజుపాలెంలో జరుగుతున్న కోడి పందేలు



రాజుపాలెంలో కోడికి కత్తి కదుతున్న పందెం రాయుళ్లు



ఎస్.కొత్తపల్లిలో బరిలో తలపడుతున్న పందెం కోళ్లు



కామనరువులో జోరుగా సాగుతున్న గుండాట

ప్రభల తీర్థం.. అంతా సిద్ధం

ముమ్మిడివరం: సంక్రాంతి పర్వదినాల్లో చివరి రోజైన కనుమ పండగ రోజు ముమ్మిడివరం మండలం పల్లిపాలెం, ఐ.పోలవరం మండలం మొక్కతోట, కాట్రేనికోన మండలం చెయ్యేరు గ్రామాల్లో జరిగే ప్రభల తీర్థానికి ఎంతో ప్రత్యేకత ఉంది. కనుమ రోజున ఏకాదశ రుద్రులు లోక కల్యాణార్థం చర్చిస్తారని ప్రతీతి. ప్రభను వీరభద్రుని స్వరూపంగా ప్రజలు పూజిస్తారు. ఈ ఏడాది ప్రభల తీర్థం కోసం ప్రభలను ఆయా గ్రామాల్లో ఇప్పటికే ముస్తాబు చేశారు. కనుమ రోజున వివిధ గ్రామాల నుంచి పంట చేలు, కొబ్బరి తోటలు, కాలువలు దాటుకుని ప్రభలను తీసుకెళతారు. పల్లెపాలెంలో నిర్వహించే తీర్థానికి కొమానపల్లి, నడిమిలంక, ముమ్మిడివరం, అగ్రహారం, కొత్తలంక, వడ్డిగూడెం, రాజుపాలెం, చింతలమెరక గ్రామాల నుంచి ప్రభలను తోడ్కొని వస్తారు.



తీర్థ స్థలికి ప్రభలను తోడ్కొని వస్తున్న భక్తులు(ఫైల్)

పేకాట శిబిరంపై దాడి

కాట్రేనికోన: మండలంలోని పల్లంకుర్రులో పేకాట శిబిరంపై ట్రైనీ డీఎస్పీ వల్లెం విష్ణు స్వరూప్ ఆధ్వర్యంలో పోలీసులు ఆదివారం ఆకస్మికంగా దాడి చేసి పేకాడుతున్న 22 మందిని అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి రూ.1,42,810 నగదు స్వాధీనం చేసుకున్నారు. కాట్రేనికోన ఎస్ఐ నాగేశ్వరరావు తెలిపిన వివరాల ప్రకారం దాడిలో పేకాడుతున్న గబ్బర్ సింగ్, నడింపల్లి వాసురాజు, జి.రవిరాజు, జి.నాగరాజు, డి.కిరణ్, సీహెచ్ వీర్రాజు, డి.ముత్యాలరాజు, కె.కిషోర్, ఎం.రఘురామరాజు, ఎం.రాజేష్ తదితరులను అరెస్ట్ చేసి కేసు నమోదు చేశారు.

కమర్షియల్ ట్యాక్స్ అధికారులపై కేసు

యానాం: పుదుచ్చేరిలో కమర్షియల్ ట్యాక్స్ అధికారులపై సీబీఐ ఆదివారం కేసు నమోదు చేసింది. ఒక ప్లాస్టిక్ సంచుల ఫ్యాక్టరీకి సంబంధించి ట్యాక్స్ చెల్లింపు విషయంలో అవినీతికి పాల్పడ్డారనే ఆరోపణలతో ఏసీటీఓలు ఎ.ఆనందన్, పి.మురుగానందం, రితిగా అరుణ్, ట్యాక్స్ సంబంధిత విషయాలు చూసే కన్సల్టెంట్ సెల్వరాజ్, సోలమలైలపై సీబీఐ చెన్నై విభాగ అధికారులు కేసు నమోదుచేశారు.

అయోధ్య రాముని అక్షతల పంపిణీ



దొమ్మేటిపేటలో అయోధ్య రాముని అక్షతలు పంపిణీ చేస్తున్న భక్తులు

యానాం: నియోజకవర్గ పరిధిలోని దొమ్మేటిపేటలో అయోధ్యరాముని అక్షతల పంపిణీ కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు కిరణ్‌కుమార్, ఆర్ఎస్ఎస్ ప్రతినిధి శివ ఆధ్వర్యంలో అక్షతలను ఇంటింటికీ వెళ్లి పంపిణీ చేశారు. అయోధ్య రామ మందిరం ప్రారంభోత్సవ కార్యక్రమానికి అధిక సంఖ్యలో భక్తులు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

విలసవిల్లిలో..



విలసవిల్లిలో అయోధ్య రాముని అక్షతలను పంపిణీ చేస్తున్న భక్తులు

ఉప్పలగుప్తం: మండలంలోని విలసవిల్లిలో అర్చకులు మున్నంగి రామకృష్ణశర్మ అయోధ్య అక్షతల పంపిణీ కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ నెల 22న అయోధ్యలో జరిగే శ్రీరామ మందిరంలో విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమంపై ప్రజలకు వివరిస్తూ ఇంటింటికీ అయోధ్య అక్షతలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

బుల్లితెర నటుడు కల్కి రాజా సందడి

మామిడికుదురు: బుల్లితెర నటుడు కల్కి రాజా ఆదివారం తన స్వగ్రామం పాశర్లపూడిలంకలో సందడి చేశారు. పాశర్లపూడిలంక సర్పంచ్ తెలగారెడ్డి సూర్యప్రకాశరావు కుమారుడైన కల్కి రాజా తన కుటుంబ సభ్యులతో కలిసి సంప్రదాయ దుస్తులతో భోగి మంట వెలిగించి, ఆవు పేడతో తయారు చేసిన పిడకల దండలు మంటలో వేసి సందడి చేశారు. మహిళలు చీర కట్టులో దాండియా ఆడారు. సంక్రాంతి పండగకు వన్నె తెచ్చే చెరుకుగడలు, పాడి కుండలు, తదితర వాటిని ఏర్పాటు చేసి సంక్రాంతి పండగను ఘనంగా నిర్వహించారు. గ్రామీణ ప్రాంతాలకు చెందిన ప్రజలు పట్టణ ప్రాంతాలకు వలస వెళ్లి మన పురాతన సంస్కృతి, సంప్రదాయాలను మర్చిపోతున్నారని వాటిని నేటి తరానికి గుర్తుచేయాలన్న ఉద్దేశంతోనే సంక్రాంతి పండగను ఘనంగా నిర్వహిస్తున్నామని కల్కి రాజా పేర్కొన్నారు. సంక్రాంతి పండగ కోసం తమ బంధువులు ఒమన్, డెన్మార్క్‌ల నుంచి వచ్చారని చెప్పారు.



పాశర్లపూడిలంకలో భోగి మంట వద్ద కల్కి కుటుంబ సభ్యుల సందడి

ప్రభల తీర్థానికి భారీ బందోబస్తు

అంబాజీపేట: మండలంలోని మొసలపల్లి పంచాయతీ పరిధి జగ్గన్నతోటలో ఈ నెల 16న నిర్వహించే ప్రభల తీర్థానికి ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు భారీ బందోబస్తు నియమించినట్లు ఎస్సై ఎ.చైతన్యకుమార్ తెలిపారు. ముగ్గురు సీఐలు, 11 మంది ఎస్సైలు, ఏఎస్సైలు, హెడ్ కానిస్టేబుల్స్, పోలీసులు, హోంగార్డులు 200 మందిని కొత్తపేట డీఎస్పీ కేవీ రమణ నియమించినట్లు సీఐ డి.ప్రశాంత్‌కుమార్, ఎస్సై ఎ.చైతన్యకుమార్ తెలిపారు. తీర్థంలో ఎటువంటి అసాంఘిక కార్యక్రమాలకు, అల్లర్లకు పాల్పడినా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. తీర్థానికి వచ్చే భక్తులు ప్రభల నిర్వాహకులకు, పోలీసులకు సహకరించాలన్నారు. తీర్థంలోకి ప్రభల వెంట ఎటువంటి సినీ, రాజకీయ ఫ్లెక్సీలను తీసుకురావద్దని అలా తీసుకువస్తే చర్యలు తీసుకుంటామన్నారు.

వైభవంగా గోదాదేవి కల్యాణం

ఉప్పలగుప్తం: ధనుర్మాసం సందర్భంగా మండలంలోని భీమనపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం గోదాదేవి కల్యాణం వైభవంగా నిర్వహించారు. యువతీ, యువకులు సంప్రదాయ దుస్తులు ధరించి ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. అనంతరం స్వామిని ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయ సన్నిధిలో అన్నసమారాధన జరిగింది.



భీమనపల్లిలో స్వామి వారి కల్యాణంలో పాల్గొన్న భక్తులు

‘సందెపు’ సేవలు అభినందనీయం

యానాం: ప్రముఖ శాస్త్రవేత్త, మెట్రో కమ్ పరిశ్రమ అధినేత డాక్టర్ సందెపు వెంకటేశ్వరరావు సేవలు అభినందనీయమని పలువురు పేర్కొన్నారు. ఆదివారం స్థానిక జీవీఎస్ రెసిడెన్సీలో యానాం పూర్వపు తెలగా అభ్యుదయ సంఘం అధ్యక్షుడు గాజుల శ్రీబ్రహ్మానందం తదితరుల ఆధ్వర్యంలో డాక్టర్ సందెపు వెంకటేశ్వరరావు దంపతులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో చిక్కాల గణేష్, గంధం పల్లంరాజు, కాటంశెట్టి రామ్మూర్తి నాయుడు, గొల్లపల్లి వీర్రాజు, నల్లావెంకన్న తదితరులు పాల్గొన్నారు.



శాస్త్రవేత్త సందెపు వెంకటేశ్వరరావు దంపతులకు సత్కారం

జనఔషధ కేంద్రాలతో తక్కువ ధరలకే మందులు

సఖినేటిపల్లి: ప్రధానమంత్రి జన ఔషధ కేంద్రాల ద్వారా తక్కువ ధరలకే మందులు అందుబాటులోకి వచ్చాయని బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి మాలే శ్రీనివాస నగేష్, రాష్ట్ర కిసాన్ మోర్చా డ్రైనేజీ సెల్ కన్వీనర్ చెంపాటి శివరామకృష్ణంరాజు అన్నారు. ఆదివారం ఉయ్యూరువారి మెరక, శృంగవరప్పాడు గ్రామాల్లో అధికారులు వికసిత్ భారత్ సంకల్పయాత్ర కార్యక్రమాల సమావేశాలు నిర్వహించారు. ఉయ్యూరువారి మెరకలో సర్పంచ్ ఓగూరి రత్నకుమారి, శృంగవరప్పాడులో సర్పంచ్ రావి నాగవెంకట లక్ష్మీదేవి అధ్యక్షతన జరిగిన సమావేశాల్లో వారు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. శాఖల వారీగా కేంద్రం పేదలకు అమలు చేస్తున్న పథకాలను అధికారులు వివరించారు. పార్టీ నియోజకవర్గ కన్వీనర్ అడబాల రాంబాబు, నాయకులు పట్టపు సూర్యప్రకాశరావు, యెనుముల సుబ్బారావు, రుద్రరాజు సత్యనారాయణరాజు, ఈవోపీఆర్డీ కె.సూర్యనారాయణ, ఏపీవో నాగప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



ఉయ్యూరువారి మెరక వికసిత్ భారత్ సంకల్పయాత్రలో మాట్లాడుతున్న రత్నకుమారి